క్లుప్తంగా

ఘనంగా దశావతారాలు



బోట్‌క్లబ్: రజిత చిన్న దశావతార అలంకార ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి రామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామి వారికి ఆలయ ప్రధాన అర్చకుడు భావవరపు భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జికి అభినందనలు



జేసీ ఇలక్కియకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సంఘం సభ్యులు

బాలాజీచెరువు: జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జ్‌గా నియమితులైన జేసీ ఎస్.ఇలక్కియను గ్రంథాలయ సంస్థ పింఛనుదారుల సంక్షేమ సంఘం శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసారు. గ్రంథాలయ ఉద్యోగులతో పాటు విశ్రాంత ఉద్యోగుల సంక్షేమానికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. జిల్లా గ్రంథాలయ సంస్థ పింఛనుదారుల సంఘ ప్రధాన కార్యదర్శి సలాది సాయి సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు డి.రాజగోపాల్ ఉన్నారు.

ఓటు వినియోగంపై అవగాహన



రమణయ్యపేట పంచాయతీ వద్ద ఈవీఎం వినియోగాన్ని వివరిస్తున్న కార్యదర్శులు

కాకినాడ రూరల్: మండలంలోని పండూరు, రమణయ్యపేట గ్రామాల్లో ఈవీఎంలో ఓటు వేసే విధానంపై అధికారులు శుక్రవారం అవగాహన కల్పించారు. పండూరు, రమణయ్యపేట పంచాయతీ కార్యదర్శులు రామ్మోహన్, వెంకటరమణ, వీఆర్వో నున్న సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రూ.10 వేల ఆర్థికసాయం



బాధితుడికి ఆర్థికసాయం, నిత్యావసరాలు అందజేసిన శ్రీనివాసరావు

కరప: గ్రామంలోని రామకంచిరాజునగర్ కాలనీలో అనారోగ్యంతో బాధపడుతున్న ఎంవీవీ సత్యనారాయణకు మానవత్వం స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో రిటైర్డు లేబర్ ఆఫీసర్ వి.శ్రీనివాసరావు రూ.10 వేలు ఆర్థికసాయం, నిత్యావసరాలు అందజేశారు. మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు కాలనీకి చెందిన సత్యనారాయణ బ్లడ్ ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్న విషయాన్ని మానవత్వం సేవా సంస్థకు తెలిపారు. ఈ మేరకు ఆర్థికసాయం, నిత్యావసరాలు అందజేశారు.

71 శాతం పింఛన్ల పంపిణీ

కరప: మండల పరిధిలోని 23 గ్రామాల్లో 11,597 మందికి వివిధ రకాల పింఛన్లు ఇవ్వాల్సి ఉండగా శుక్రవారం 8,240 మందికి (71.05 శాతం) పంపిణీ చేసినట్టు ఎంపీడీఓ కె.అప్పారావు తెలిపారు. పలు సాంకేతిక కారణాలతో నూరుశాతం పంపిణీ జరగలేదని, శని, ఆదివారాల్లో నూరుశాతం పూర్తి చేయిస్తామని ఆయన తెలిపారు. ఈఓపీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శులు పింఛన్ల పంపిణీని పర్యవేక్షించారు. నడకుదురు-2 గ్రామ సచివాలయంలో 84.71 శాతం, గురజనాపల్లి గ్రామ సచివాలయం 80.84 శాతం, వేళంగి-1, గ్రామ సచివాలయాలు 80.42 శాతంతో పింఛన్ల పంపిణీలో మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి.

పంచారామ క్షేత్రంలో జ్యోతిర్లింగార్చన



సామర్లకోట: పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి జ్యోతిర్లింగార్చన నిర్వహించారు. ఆలయంలో లక్ష పత్రి పూజలు చేసిన వారికోసం ఆలయ దీపారాధన సంఘ సభ్యులు జ్యోతిర్లింగార్చన ఏర్పాటు చేశారు. ధ్వజ స్తంభం వద్ద దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి, అర్చకులు ఆకాశ దీపం వెలిగించారు. అనంతరం జ్యోతిర్లింగార్చన చేశారు.

మానసిక స్థైర్యాన్ని నింపుదాం

- కలెక్టర్ కృతికా శుక్లా
- కలెక్టరేట్‌లో ఎయిడ్స్ నివారణ దినోత్సవం

కాకినాడ సిటీ: ఎయిడ్స్ ప్రభావిత వ్యక్తుల్లో మానసిక స్థైర్యాన్ని పెంపొందించడంతో పాటు హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణకు ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ కృతికా శుక్లా పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ యూనిట్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కలెక్టర్ కృతికా శుక్లా, జేఎన్టీయూకే వీసీ ప్రసాదరాజు, ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్, జేసీ ఎస్.ఇలక్కియ ముఖ్య అతిథులుగా పాల్గొని, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో పాటు ఎయిడ్స్ ప్రభావిత చిన్నారులతో సహ పంక్తి భోజనం చేశారు. ఓఎన్‌జీసీ, భీమాబాయి మహిళా మండలి సంస్థ సమకూర్చిన న్యూట్రిషన్ కిట్లను చిన్నారులకు అందించారు. ఈ సంవత్సరం లెట్ కమ్యూనిటీస్ లీడ్ అనే స్లోగన్‌తో ఈ కార్యక్రమం నిర్వహించనున్నామని, ఎయిడ్స్ నుంచి బయటపడడానికి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని, ప్రస్తుతం ఎయిడ్స్‌తో బాధపడేవారిలో చాలా వరకు అవగాహన వచ్చిందన్నారు. ప్రభుత్వ పరంగా జిల్లాలో ప్రతీ సీహెచ్‌సీలో ఐసీటీసీ సెంటర్ల ద్వారా ఎయిడ్స్ వ్యాధికి మందులు ఉచితంగా అందిస్తున్నామన్నారు. జిల్లాలో 15 వేల మంది పెద్ద వారికి, 106 మంది చిన్నారులకు ప్రతి ఆరు నెలలకు మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. జేఎన్టీయూకే వీసీ ప్రసాదరాజు ఎయిడ్స్ నివారణకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందన్నారు. అదే విధంగా రంగోలి పోటీలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందిన ఎస్.వీరలక్ష్మి, వీహెచ్ జాహ్నవి, కె.శ్రావిణిలకు బహుమతులు అందజేశారు. అనంతరం పిల్లలకు డీటీజీ ఆధారిత మందులపై విజయవాడలోని రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జె.నరసింహ నాయక్, డీసీహెచ్ఎస్ స్వప్న, జీజీహెచ్ సూపరింటెండెంట్ లావణ్యకుమారి, జిల్లా ఎయిడ్స్, లెప్రసీ అధికారి ఆర్.రమేష్, ఎయిడ్స్ నియంత్రణ సంస్థ మేనేజర్ జి.ఆదిలింగం, ఓఎన్‌జీసీ, భీమాబాయి మహిళా మండలి ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్సీ పద్మశ్రీ, జిల్లా అధికారులు

అవగాహనతోనే ఎయిడ్స్ అంతం

కాకినాడ క్రైం: ఓ దశలో ప్రపంచాన్ని కుదిపేసిన హెచ్ఐవీ ఎయిడ్స్ పూర్తిగా అంతం అవడానికి అవగాహన ఒక్కటే సాధనమని రంగరాయ వైద్య కళాశాల (ఆర్ఎంసీ) వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఏ.విష్ణువర్ధన్ అన్నారు. శుక్రవారం ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని ఆర్ఎంసీ, సామాజిక వైద్య శాస్త్ర విభాగం, నేషనల్ సీరం యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహనాభరితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అకడమిక్ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ దేవీ మాధవి ఆధ్వర్యంలో కళాశాల ఆవరణ నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని డాక్టర్ విష్ణువర్ధన్ జెండా ఊపి ప్రారంభించారు. భానుగుడి కూడలి వరకు వెళ్లి అక్కడ మానవహారంగా ఏర్పడి ఎయిడ్స్ వ్యాప్తిని నిలువరించాలని విద్యార్థులంతా నినాదాలు చేశారు. రెడ్ రిబ్బన్ ప్రదర్శించి మహమ్మారిపై అవగాహన కల్పించేందుకు కరపత్రాలు పంచారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎల్.సౌమ్య, ఫోరెన్సిక్ హెచ్‌వోడీ డాక్టర్ ఉమామహేశ్వరరావు, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ మునిరత్నమ్మతో సహా వైద్య, కళాశాలల బోధకులు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ యువసేన సేవలకు కలెక్టర్ ప్రశంస

కాకినాడ శ్రీ యువసేన బ్లడ్ బ్యాంక్ అందిస్తున్న రక్తదాన, సామాజిక సేవలను కలెక్టర్ కృతికాశుక్లా సహా ఎస్పీ సతీష్‌కుమార్ ప్రశంసించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా సంస్థ వ్యవస్థాపకుడు బొల్లం సతీష్‌కు అభినందన పత్రాన్ని అందజేసి జ్ఞాపికను బహూకరించారు.



భానుగుడి కూడలిలో వైద్య, నర్సింగ్ విద్యార్థుల మానవహారం



వేళంగిలో నిర్వహిస్తున్న ఎయిడ్స్ అవగాహన ర్యాలీ



బొల్లం సతీష్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

సమష్టి కృషితో ఎయిడ్స్ నివారణ

కరప: ఎందరో జీవితాలను బలికొంటున్న ఎయిడ్స్ నివారణకు సమష్టి కృషి అవసరమని వేళంగి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎంకే సౌజన్య పేర్కొన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం వేళంగి పీహెచ్‌సీలో వైద్యసిబ్బంది, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. అనంతరం పీహెచ్‌సీ సిబ్బంది, భీమాబాయి మహిళామండలి సభ్యులతో కలసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ సిబ్బంది కె.గోవిందబాబు, పీవీ రమణారావు, డి.కృష్ణశేఖర్, భీమాబాయి మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక వ్యాధిపై ర్యాలీ

బాలాజీచెరువు: పీఎస్ లక్ష్మి మహిళ కళాశాల ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ ఎయిడ్స్ నివారణ దినోత్సవం నిర్వహించారు. శుక్రవారం ఈ వ్యాధి నివారణపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ వి.సంధ్య హాజరై వ్యాధికి గల కారణాలు, తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్లకార్డులతో విద్యార్థులచే ప్రదర్శన చేయించారు. నివారించే పద్ధతులు, తదితర వాటిపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు లావణ్యకుమారి, కృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ పద్మజ, విద్యార్థులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

కాకినాడ రూరల్: ఎయిడ్స్ నియంత్రణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సర్పవరం జంక్షన్‌లో శుక్రవారం సిద్ధార్థ హాస్పటల్, హరీష్ స్పోర్ట్స్, శరత్, సుబ్బారావుల సహకారంతో ఒక్కొక్కరికి రూ.700 విలువైన నిత్యావసర సరుకులు పంపిణీ చేసినట్టు ఉమా మనోవికాస కేంద్రం ప్రతినిధి రాజా తెలిపారు. ఈ సందర్భంగా వారు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. లయన్స్ సఖి ఆధ్వర్యంలో సర్పవరం జంక్షన్‌లో లయన్స్ మహిళల ఆరోగ్య చైర్‌పర్సన్ ఎం.పద్మతులసి, కోమలి, అడబాల రత్నప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు తదితరులు ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అలాగే కోరమాండల్ మహిళా క్లబ్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

ఓటరుగా నమోదు చేసుకోండి

- ఈఆర్వో నాగనరసింహారావు
- నేడు, రేపు ప్రత్యేక ఓటరు శిబిరాలు



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నాగనరసింహారావు

కాకినాడ: జనవరి 1, 2024 నాటికి 18 ఏళ్లు నిండిన యువత ఓటు హక్కుకోసం దరఖాస్తు చేసుకోవచ్చునని నియోజకవర్గ ఈఆర్వో, నగర పాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు సూచించారు. స్థానిక స్మార్ట్‌సిటీ కార్యాలయంలో ఏఈఆర్వోలు, బీఎల్‌వోలతో ఓటరు సంక్షిప్త సవరణ-2024పై శుక్రవారం సాయంత్రం ఆయన సమీక్షించారు. ఓటు హక్కు కోసం ఫారం-6 ద్వారా ఆన్‌లైన్ ద్వారా గానీ, నేరుగా సంబంధిత పోలింగ్‌స్టేషన్లలో గానీ దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. నియోజకవర్గంలో శని, ఆదివారాల్లో 233 పోలింగ్ స్టేషన్లలోనూ ఓటరు నమోదు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు. ఆ శిబిరాల్లో కొత్త ఓట్ల నమోదుతో పాటు 7, 8 ఫారాల ద్వారా మార్పులు, చేర్పులు, తొలగింపులు చేసుకోవచ్చునన్నారు. ఆయా తేదీల్లో పోలింగ్ స్టేషన్ల వద్ద ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బీఎల్‌వోలు, ఇతర సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు.

దరఖాస్తులు పరిష్కరించండి

నగర పరిధిలో ఓటరు సంక్షిప్త సవరణలో భాగంగా ఫారం-6, 7, 8 ద్వారా 93,546 దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటిలో 88 వేలకు పైగా దరఖాస్తులను ఇప్పటికే పరిష్కరించామని, మిగిలినవి కూడా త్వరలోనే పరిష్కారమవుతాయన్నారు. జనవరి 5వ తేదీన ఓటర్ల తుది జాబితా ప్రచురితమవుతుందని, ఈ లోపుగా వచ్చిన దరఖాస్తులన్నీ ఎప్పటికప్పుడు పరిష్కరించి ఆన్‌లైన్ చేయాలని సూచించారు. సమావేశంలో ఏఈఆర్వోలు కోన శ్రీనివాస్, సీతాపతి, హరిదాసు, నాగశాస్తులు, మురళీకృష్ణ, సూపర్‌వైజరీ అధికారులు, బీఎల్‌వో పాల్గొన్నారు.

పన్నులు చెల్లించి సహకరించండి

- కమిషనర్ నాగనరసింహారావు
- గృహనిర్మాణం, పన్నుల వసూళ్లపై సమీక్ష

కాకినాడ: నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన ఆస్తి, కుళాయి, ఖాళీస్థలాల, నీటి పన్నులను సకాలంలో చెల్లించి సహకరించాలని కార్పొరేషన్ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. స్థానిక స్మార్ట్‌సిటీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం పన్ను వసూళ్లపై సంబంధిత అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. ఆర్థిక సంవత్సరం ముగింపు దగ్గర పడుతున్నందున సకాలంలో పన్నులు కట్టి సహకరించాలని ప్రజలను కోరారు. రోడ్లు, డ్రైన్లు వంటి మౌలిక సదుపాయాలతో పాటు తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, పారిశుధ్యం సహా ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో సకాలంలో చెల్లించే పన్నులే ప్రధాన భూమిక వహిస్తాయన్నారు. పన్నుల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. పాత బకాయిలు చెల్లించకపోతే నిబంధనల ప్రకారం కుళాయి కనెక్షన్లు తొలగించాలని కోరారు. డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, రెవెన్యూ అధికారులు చెక్కా రమణ, నిర్మలాకుమారి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, ఆయా సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

యూజర్ చార్జీలపై..

మెరుగైన పారిశుధ్య సేవల కోసం యూజర్ చార్జీలను సకాలంలో చెల్లించాలని కమిషనర్ నాగనరసింహారావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇంటింటా చెత్త సేకరించే హూపర్ టిప్పర్ వాహనాల నిర్వహణకు ప్రతి నెల రూ.55లక్షలు ఖర్చు అవుతుందన్నారు. ఈ వ్యయాన్ని యూజర్ చార్జీల ద్వారానే భరించాల్సి ఉంటుందన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

గృహ నిర్మాణ ప్రగతిపై కమిషనర్ నాగనరసింహారావు హౌసింగ్, మెప్మా, కార్పొరేషన్ అధికారులతో స్మార్ట్‌సిటీ హాలులో సమావేశమయ్యారు. కొమరగిరి, పండూరు, ఏపీ త్రయంలే అవుట్లలో గృహనిర్మాణ ప్రగతిని సమీక్షించారు. నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, గృహనిర్మాణశాఖ డీఈ సత్యనారాయణరెడ్డి, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్లు జిలానీ, రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి ఏపీ ఆదర్శం

- ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ
- 30వ డివిజన్‌లో వై ఏపీ నీడ్స్ జగన్

కాకినాడ: అభివృద్ధి, సంక్షేమానికి దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఏపీ ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ పేర్కొన్నారు. స్థానిక 30వ డివిజన్‌కు సంబంధించి బ్రహ్మంగారి ఆలయం వద్ద సంక్షేమ పథకాల లబ్ధిదారుల సమావేశం శుక్రవారం జరిగింది. కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు సంబంధించిన ప్రదర్శన ఫలకాన్ని ఎమ్మెల్సీ పద్మశ్రీ, నాయకులు ఆవిష్కరించారు. కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి మాట్లాడుతూ సచివాలయ, వలంటరీ వ్యవస్థ ద్వారా కుల, మత రాజకీయాలకు అతీతంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శక పాలన అందిస్తున్నారన్నారు. గడచిన నాలుగేళ్లలో 30వ డివిజన్‌లో రూ.25 కోట్ల విలువైన అభివృద్ధి, సంక్షేమ పథకాల లబ్ధి చేకూరిందన్నారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్ రాగిరెడ్డి బన్ని, త్రిపురసుందరి ఆలయ కమిటీ ఛైర్మన్ పెద్ది రత్నాజీ, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, పలువురు మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.



సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ పద్మశ్రీ తదితరులు

సంక్షేమ ప్రదాతను మళ్లీ గెలిపించుకుందాం

కరప: ప్రజా సంక్షేమంతో పాటు అవినీతికి తావు లేకుండా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలుపించుకుందామని ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి పేర్కొన్నారు. మండలం గొర్రిపూడి-2 గ్రామ సచివాలయంలో శుక్రవారం సర్పంచ్ కె.రమాదేవి అధ్యక్షతన జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్‌లో ఆమె మాట్లాడారు. నాలుగున్నరేళ్ల పాలనలో ప్రజలకు జరిగిన మేలును వివరించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రజల కోసం పనిచేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబును గెలిపించి తద్వారా జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలన్నారు. అనంతరం సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. నోడల్ అధికారి, ఈఓపీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు మాట్లాడుతూ గొర్రిపూడి-2 సచివాలయం పరిధిలో రూ.23.68తో జరిగిన, జరుగుతున్న అభివృద్ధి పనులు వివరించారు. అనంతరం గ్రామ కూడలిలో వైఎస్సార్ సీపీ పతాకాన్ని నాయకులు ఆవిష్కరించారు. జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, పీఏసీఎస్ మాజీ ఛైర్మన్ చీకాల అప్పలరాజు, పార్టీ నాయకులు పెంకే సత్తిబాబు, అంకన విష్ణు, ఎం.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



గొర్రిపూడిలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు, అధికారులు

లలితాంబా నమోస్తుతే



కుంకుమార్చనల కోసం బారులు తీరిన మహిళలు

- శ్రీపీఠంలో భారీగా కుంకుమార్చనలు
- పవిత్ర శుక్రవారం పోటెత్తిన మహిళలు
- 18వ రోజుకు చేరుకున్న మహాశక్తి యాగం

కాకినాడ రూరల్: పవిత్ర కార్తిక మాసంలో ఆధ్యాత్మికతకు శ్రీపీఠం వేదికైంది. ఇక్కడ నిర్వహిస్తున్న మహాశక్తి యాగంలో లలితా కుంకుమార్చలకు భక్తులు రోజురోజుకూ పోటెత్తుతున్నారు. పరిపూర్ణానంద స్వామి ఆశీస్సులతో ఇప్పటికి 18 రోజులు పూర్తయ్యాయి. శత కోటి కుంకుమార్చనలలో భాగంగా ఇప్పటికి సుమారు 66 కోట్లు పూర్తయ్యాయి. శుక్రవారం కావడంతో శ్రీపీఠానికి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. నిత్యం సుమారు 15వేల మంది వస్తుండగా శుక్రవారం 20 వేల మంది వరకు హాజరయ్యారు. వారందరితో లలితా సహస్ర నామాలు చదువుతూ పరిపూర్ణానంద స్వామి కుంకుమ పూజలు చేయించారు. కుంకుమార్చనల వేదికపై నుంచి నైమిశారణ్యం బాల బ్రహ్మానంద స్వామిజీ ఆధ్యాత్మిక సందేశం ఇచ్చారు. సాయంత్రం కోటి దీపోత్సవ వేదికపై మాధవపెద్ది మూర్తి బృందం నృత్య ప్రదర్శనతో ఆకట్టుకుంది. సాయంత్రం 6 గంటలకు దీపోత్సవం, అనంతరం బగళాముఖి హోమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు దీపోత్సవంలో పాల్గొన్నారు.



లలితాంబ, పార్వతీ పరమేశ్వరులకు హారతి ఇస్తున్న పరిపూర్ణానంద స్వామి

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

కరప: లబ్ధిదారులను చైతన్యపరచి గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీడీఓ కె.అప్పారావు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సచివాలయం అసిస్టెంట్లు, హౌసింగ్ సిబ్బందితో సమావేశమై గృహ నిర్మాణాలపై సమీక్షించి, పలు సూచనలు ఇచ్చారు. రెండో విడతగా మండలంలో 263 మందికి గృహ రుణాలు మంజూరు చేశామని, వచ్చే ఫిబ్రవరిలో ముఖ్యమంత్రి జగన్ వీటిని ప్రారంభించనున్నారని, ఆ లోగా నిర్మాణాలు పూర్తిచేయాలని కోరారు. కావలసిన ఇసుక, సిమెంట్, ఐరన్ సిద్ధంగా ఉన్నాయని, బిల్లులు కూడా వెంటనే చెల్లిస్తారని లబ్ధిదారులకు తెలియచెప్పాలని ఎంపీడీఓ సూచించారు. మండల ప్రత్యేకాధికారి, జిల్లా ఉపాధి కల్పనాధికారి జి.శ్రీనివాస్, హౌసింగ్ ఏఈఈ ఎస్.రాంబాబు, మండల ఇంజినీరింగ్ అధికారి జి.శైలజ తదితరులు పాల్గొన్నారు.



కరపలో గృహనిర్మాణాలపై సమీక్ష జరుపుతున్న అధికారులు

సకాలంలో పూడిక తీయాలి

- రబీకి సాగునీటి విడుదల
- జెడ్పీటీసీ సభ్యుడు సుబ్బారావు



పంటకాలువ పూడికతీత పనులు ప్రారంభిస్తున్న నాయకులు, అధికారులు

కరప: రబీ సాగుకు పంట కాలువలకు నీరు వదలడం పూర్తయిందని, పూడికతీత పనులు సకాలంలో పూర్తిచేయించాలని జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు అన్నారు. చింతపల్లి లాకుల వద్ద కరప మండలానికి వచ్చే పంటకాలువ పూడికతీత పనులకు ఆయన కరప, పెదపూడి ఎంపీపీలు పెంకే శ్రీలక్ష్మి, కేతా తులసిలతో కలసి పూజచేసి, ప్రారంభించారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు వినతి మేరకు కలెక్టర్ ఈ పనులకు నిధులు మంజూరు చేశారన్నారు. చింతపల్లి లాకుల నుంచి శహపురం అక్కిరేవు వరకు 10 కిలోమీటర్ల మేర పూడిక తీయనున్నట్టు తెలిపారు. పది రోజుల్లో రబీ నారుమళ్లు పూర్తిచేయాలని, అందుకు అనుగుణంగా నాలుగైదు రోజుల్లో పూడిక తీయాలని ఆయన ఇరిగేషన్ డీఈఈ ఆకెళ్ల రవికుమార్‌ను కోరారు. మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, కరప డీసీ మాజీ అధ్యక్షుడు బండే తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం ఇవ్వాలి

కాకినాడ సిటీ: ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని కోరుతూ ఈనెల 11, 12 తేదీల్లో కలెక్టరేట్ వద్ద 36 గంటల ధర్నా నిర్వహించాలని ఆశ వర్కర్స్ యూనియన్ విస్తృతస్థాయి సమావేశం ప్రకటించింది. శుక్రవారం సీఐటీయూ కార్యాలయంలో సంఘం అధ్యక్షులు నర్ల ఈశ్వరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంఘం గౌరవాధ్యక్షురాలు జి.బేబీరాణి, సంఘం ప్రధాన కార్యదర్శి చంద్రమళ్ల పద్మ, రాయుడు నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మస్జిద్ నిర్మాణానికి శంకుస్థాపన



మస్జిద్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: స్థానిక రమణయ్యపేటలో మస్జిద్ ఏ నూర్‌కు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు శుక్రవారం శంకుస్థాపన చేశారు. మసీదు కమిటీ ప్రెసిడెంట్ అన్వర్ బాషా, గౌరవ అధ్యక్షులు హుస్సేన్ బాబు, అబ్దుల్లా, రూరల్ నియోజకవర్గం మైనార్టీ సెల్ అధ్యక్షులు, కాకినాడ జిల్లా వక్ఫ్‌బోర్డు సెక్రటరీ కరీం బాషా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కురసాల మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముస్లిం మైనారిటీలకు ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని అందులో భాగంగా నూర్ బాషా దూదేకుల వారికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి దానికి ఛైర్మన్‌ను కూడా నియమించారన్నారు. మీరు తమపై చూపిస్తున్న ఆప్యాయత అభిమానాలను ఎప్పటికీ మరిచిపోలేనని కొనియాడారు. నిర్మాణ దాత శ్రీనివాస్, రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి ఎండీ అజిగర్, వక్ఫ్‌బోర్డు అధ్యక్షులు రెహమాన్ ఖాన్, పార్లమెంటు జిల్లా అధ్యక్షులు ఎండి బాషా, ఎస్ఎస్‌వీటీ ట్రాన్స్‌పోర్ట్ అధినేత అహ్మద్, కేజీఎన్ ట్రాన్స్‌పోర్టు మహమ్మద్ వలి, ముక్తాక్ అహ్మద్, ముస్లిం పెద్దలు, మసీదు కమిటీ సభ్యులు, కార్యకర్తలు నాయకులు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.